క్లుప్తంగా

కాకరాపల్లిలో అధికారుల విచారణ



కాకరాపల్లిలో ఇరు వర్గాలవారితో మాట్లాడుతున్న మండల స్థాయి అధికారులు

మునగపాక : కాకరాపల్లిలో కొద్దిరోజులుగా జరుగుతున్న భూ వివాదానికి సంబంధించి సమస్య పరిష్కారానికి అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల కాకరాపల్లిలో పామాయిల్ తోటతో పాటు పైప్‌లైన్‌ను కొంతమంది ధ్వంసం చేశారంటూ మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందిన సంగతి తెలిసిందే. దీంతో ఇరువర్గాలతో చర్చలు జరిపేందుకు బుధవారం తహసీల్దార్ ప్రకాశరావు, ఎంపీడీవో మన్మథరావు, ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్‌లు సంఘటన స్థలానికి వెళ్లారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కోటవురట్ల : అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష 41వ రోజు కొనసాగుతోంది. గిరిజనులు మాట్లాడుతూ అధికారులు తమ గోడు వినిపించుకోవాలని కోరారు. రోడ్డు లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, వైద్యం కోసం డోలీ కడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మించి బడి ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం నాయకుడు జి.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

21న నారసింహ యాగం

మునగపాక : తిమ్మరాజుపేటలో ఈ నెల 21న సుదర్శన నారసింహ యాగం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 108 మంది దంపతులతో యాగం జరుగుతుందన్నారు. ఈ యాగంలో పాల్గొనే దంపతులు సకాలానికి హాజరుకావాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి యాగాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులపై నేడు ప్రజా వేదిక

ఎస్.రాయవరం : మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎన్ఆర్ఈజీఎస్ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు ఏపీవో సత్యవతి తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 31 వరకు జరిగిన పనుల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్ పై ప్రజా వేదిక ఉంటుందన్నారు. ఈ ఏడాదిలో సుమారు రూ.8 కోట్లు మేర పనులు నిర్వహించామన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

మునగపాక : స్థానిక మెయిన్‌రోడ్డులో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. పూడిమడక రోడ్డులో వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారుల రికార్డులను ఏఎస్ఐ మన్మథరావు ఇతర పోలీసు సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట రికార్డులు ఉంచుకోవాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. వాహనదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జోరుగా వరి ఉడుపులు



అరబుపాలెంలో వరి ఉడుపులు చేస్తున్న దృశ్యం

మునగపాక: ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు అవసరమయ్యే విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేసింది. సాగునీటి కాలువలు, బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు వరి ఉడుపులు వేస్తున్నారు. కొన్ని చోట్ల దమ్ములు చేసే పనిలో ఉన్నారు.

మితిమీరిన వేగంతో ప్రమాదాలు

రాంబిల్లి: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు తప్పవని ఎస్ఐ దీనబంధు హెచ్చరించారు. బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

గొంతువాపు వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు..

కోటవురట్ల: వ్యవసాయం, పాడి పశువుల సంరక్షణ రైతుకు రెండు కళ్లలా ఉన్నాయి. ఎందులో నష్టం వచ్చినా మరొకటి ఆదుకుంటుందని రైతు నమ్మకం. దాంతో చాలా మంది రైతులు వివిధ పంటల సాగుతో పాటు పాడి పశువులను మేపుతూ వస్తారు. పాడి పశువుల సంరక్షణలో కాస్త పర్యవేక్షణ, జాగ్రత్తలు పాటిస్తే నష్టం ఉండదని పశు వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. అంతే కాకుండా ఏయే సీజన్లలో ఏయే వ్యాధులు వస్తాయో అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పాడి పశువుల్లో గొంతువాపు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అయితే ముందుగా గుర్తిస్తే నష్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో సాధారణంగా పశువుల్లో సూక్ష్మజీవుల కారణంగా గొంతు వాపు వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి ఎక్కువగా దున్నలు, గేదెల్లో కనిపిస్తుంది. నీరసంగా ఉన్న పశువులకు ఈ వ్యాధి వేగంగా సోకుతుంది. అంతేకాకుండా పల్లపు ప్రాంతాలు, వర్షపు నీరు ఎక్కువగా నిలిచిపోయే ప్రాంతాల్లోని పశువులకు గొంతు వాపు వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధిని గురక వ్యాధిగా కూడా పిలుస్తారు.



పాడి గేదె

వ్యాధి ఎలా వస్తుంది?...

ఓ రకమైన బాక్టీరియా వల్ల ఈ వ్యాధి సోకుతుంది. నీరసంగా ఉన్న, అలసిపోయిన, బలహీనంగా ఉన్న పశువులకు ఈ వ్యాధి వేగంగా సోకుతుంది.

వ్యాధి లక్షణాలు ఇవి..

పశువు ఆయాపడుతూ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంది. శ్వాస తీసుకునేటపుడు గుర్‌గుర్ అంటూ శబ్దం వస్తుంది. గొంతు పైభాగాన, మెడ కింద వాపు కనిపిస్తుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతూ ఉంటుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే జ్వర తీవ్రత 104 నుండి 106 డిగ్రీలకు పెరిగి పశువు చనిపోయే అవకాశం ఉంటుంది. నాలుక బయటకు తీస్తూ, శ్వాస తీసుకోవడానికి కష్టపడుతుంది. ఈ వ్యాధి వచ్చిన పశువుకు వెంటనే చికిత్స అందించకపోతే 24 గంటల్లో మృతి చెందే అవకాశం ఉంది.

చికిత్స ఇలా...



వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యాధికారి సలహాలు తీసుకోవాలి, సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన వాటికి యాంటీబయోటిక్స్ వేయించి, వ్యాధి ముదరక ముందే వైద్యుని సంప్రదించి చికిత్స చేయించాలి.

- ముందుగా టీకాలు వేయించాలి..
- గొంతు వాపు వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. వర్షాకాలం ముందుగానే జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశువులకు పుష్టికరమైన ఆహారం వేయాలి. వ్యాధి సోకిన పశువులను మిగతా పశువుల నుండి వేరు చేసి దూరంగా ఉంచాలి. పాకలను ఎప్పటికపుడు శుభ్రం చేయాలి.
- చనిపోయిన పశువులను సున్నపు గోతుల్లో వేసి పూడ్చివేయాలి.

– సింహాద్రప్పుడు, పశు సంవర్ధక శాఖ ఏడీ, కోటవురట్ల

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా...

ఎస్.రాయవరం: సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. తిమ్మాపురం గ్రామంలో రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన తాగునీటి వసతికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, ప్రతి ఇంటికి ఉచిత కుళాయి ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నవరత్నాలతో పాటు, అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన అవి లబ్ధిదారులకు అందే విధంగా ప్రణాళిక చేసి నిధులు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటి ఏదో ఒక లబ్ధి చేకూరే విధంగా పథకాలు అందజేసి ప్రతిపక్షాలను నోరు ఎత్తకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, వెంకటరమణ, బొండా దివాణం తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురం రెండవ రోజు గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

మునగపాక : ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. మునగపాకలోని ములబంద గోడీ ప్రాంతంలో వరి నారుమళ్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ-పంట నమోదు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఏ విస్తీర్ణంలో ఎంత మేర ఎటువంటి పంటలు వేస్తున్నారనే వివరాలను స్థానిక అధికారులు అప్‌లోడ్ చేస్తారన్నారు. ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. ఈ-పంట నమోదు చేసుకోకుంటే ప్రభుత్వం నుంచి సాయం అందదని తెలిపారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఉడుపులు చేసే ముందు నారు చివర్లను తుంచడం ద్వారా ఎదుగుదల కనిపిస్తుందని, అలాగే ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాయితీపై రైతులకు ఎరువులు,విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, వీఏఏలు సింధూజ, పవన్‌కుమార్, రైతు సంఘ అధ్యక్షులు మహేష్, రైతులు బొడ్డేడ రామునాయుడు, దాడి శివ, సూరిశెట్టి రామునాయుడు, బొడ్డేడ శివ పాల్గొన్నారు.



మునగపాకలో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

లైనుకొత్తూరులో నా భూమి-నా దేశం

- మొక్కలు నాటిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- వీర జవాన్ భార్యకు సత్కారం

యలమంచిలి : మాతృభూమి రుణం తీర్చుకోలేనిది అని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామంలో సచివాలయం వద్ద నాభూమి-నాదేశం స్థూపాన్ని అవిష్కరించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాంతంత్ర్య దిన వేడుకలు ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగం 77 సంవత్సారాలు గడిచిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమంతో ప్రతి గ్రామం, వాడవాడలా మొక్కలు నాటి నేల తల్లికి వందనం సమర్పించాలనే సంకల్పంతో చేపట్టిందని, ఎందరో మహానుభావుల త్యాగఫలమే ఈ నాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. యలమంచిలి పట్టణం రామ్‌నగర్‌కి చెందిన సీఐఎస్ఎఫ్ జవాను తోట పున్నారావు దేశ రక్షణ రంగంలో సేవలందించి బీహార్‌లో 2014లో జరిగిన పేలుడు ఘటనలో వీరమరణం పొందాడు. ఆ వీర జవాన్ భార్య తోట సౌజన్యను ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు జ్ఞాపిక దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, సర్పంచ్ కొల్లి త్రినాథ్, ఎంపీడీవో అప్పలనాయుడు, మండల అధికారి ప్రసాదరావు, ఎస్ఐ సన్నిబాబు, ఏపీఎం రాణి, పంచాయతీ సర్పంచ్‌లు కార్యదర్శులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.



లైనుకొత్తూరు గ్రామంలో నా భూమి-నాదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



సీఐఎస్ఎఫ్ జవాన్ భార్య సౌజన్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మొక్కల సంరక్షణను బాధ్యతగా భావించాలి..

కోటవురట్ల: 'నాభూమి-నాదేశం' కార్యక్రమంలో నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుని వందనం చేశారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు ఆధారమన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూర్యారావు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, ఏపీవో గంగునాయుడు పాల్గొన్నారు.



మహనీయులను స్మరిస్తూ వందన సమర్పణ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

సాగు నీటి కాలువ పూడికతీత

పాయకరావుపేట : మంగవరం, గుంటపల్లి ఆవ కాలువ ద్వారా సాగు నీరు సరఫరా జరిగే కాలువను పూడికతీత తీస్తున్నారు. ఈ మూడు సాగునీటి కాలువల ద్వారా 1250 ఎకరాల భూములకు సాగునీరు సరఫరా అవుతుంది. సుమారు 2 వేల మంది రైతుల పంట పొలాలకు నీరు సరఫరా జరుగుతుంది. ఈ కాలువల దిగువ ఆనకట్ట దారులు సొంత నిధులతో కాలువ పూడికతీత పనులు చేయిస్తున్నారు. మంగవరం ఎంపీటీసీ గూటూరు విజయ రామగోవిందు పూడికతీత పనులను దగ్గరుండి చేయిస్తున్నారు.



మంగవరం కాలువ పూడికతీత పనులు చేయిస్తున్న దృశ్యం

ఉప ఎన్నికకు ఏర్పాట్ల పరిశీలన

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉప ఎన్నిక నిర్వహణకు పోలింగ్ బూత్‌లు సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల రిటరి్నంగ్ అధికారి వెంకటనారాయణ అన్నారు. కొరుప్రోలు గ్రామంలో సర్పంచ్ ఉప ఎన్నికకు కేటాయించిన 12 బూత్‌ల ఏర్పాట్లను బుధవారం ఎంపీడీవో రామచంద్రరావుతో కలిసి పరిశీలించారు. ఉన్నత పాఠశాలతో పాటు రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బూత్‌ల వారీగా పోలింగ్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సమయంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పోలింగ్ బూత్‌ల పరిశీలనలో ఎస్ఐ ప్రసాదరావు, వీఆర్వో రాంబాబు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ , పంచాయతీ కార్యదర్శులు రామలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరిరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో త్యాగాలు చేసిన మహానుభావులను గుర్తు చేసుకొని మొక్కలు నాటడం ద్వారా వనాలను పెంచాలని కోరారు. హెచ్ఎం వై.అరుణకుమారి, ఉపాధ్యాయుడు మారిసెట్టి వెంకటప్పారావు, అభ్యుదయ రైతు ఆడారి అర్జున్ పాల్గొన్నారు.



తిమ్మరాజుపేట ఎలిమెంటరీ పాఠశాలలో నాటిన మొక్కలకు నీరు పోస్తున్న దృశ్యం

కస్తూర్బా విద్యాలయానికి ఫ్యాన్ల వితరణ

మునగపాక : పాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి పూర్వ విద్యార్థులు ఫ్యాన్లు బహూకరించారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 2002-03లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం విద్యార్థుల సౌకర్యార్థం 6 ఫ్యాన్లు అందజేశారు. పూర్వ విద్యార్థి శరగడం రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విద్యాలయం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరవేగంగా సంపతిపురం
జగనన్న లేఅవుట్ పనులు

- మంత్రి అమర్‌నాథ్ హామీతో లబ్ధిదారుల్లో ఆనందం

అనకాపల్లి రూరల్: టీడీపీ నేతల కుట్రతో ఎంతో కాలంగా నిలిచిపోయిన సంపతిపురం జగనన్న లేఅవుట్ పనుల్లో కదలిక వచ్చింది. ఇక్కడ లేఅవుట్ ఏర్పాటును స్థానిక టీడీపీ నేతలు ఫిర్యాదులు, కోర్టు కేసులతో ఇన్ని రోజులూ అడ్డుకున్నారు. ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఆటంకాలు కల్పించారు. ఎట్టకేలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశంతో ఇక్కడ జగనన్న లేఅవుట్ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల సంపతిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన మంత్రికి లబ్ధిదారులు ఇళ్ల స్థలాల కోసం మొరపెట్టుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులతో మాట్లాడి నిరుపేదలకు స్థలాలిచ్చే పనిని తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. దీంతో బుధవారం గ్రామం సమీపంలో సర్వే నెం.72లో లేఅవుట్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు చదును చేయించారు. ఆర్ఐ రమేష్, సర్వేయర్ వర్మ, వీఆర్వో శ్రీనివాస్‌లు ఇక్కడి లేఅవుట్‌ను సెంటున్నర చొప్పున ప్లాట్లుగా వేసి మార్కింగ్ చేశారు. ఈ మేరకు హద్దులుగా రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ పనులను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పల్లా శ్రీను, బర్నికాన రాము, పోతల శేఖర్, కలవలపల్లి లోవరాజు, బర్నికాన శ్రీను, ఉరుకుటి వీరునాయుడు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇదే గ్రామంలో సర్వే నెం.2లో సుమారు 60 మందికి, సర్వే నెం.159లో 100 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నట్టు పల్లా శ్రీను తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ గ్రామానికి చెందిన జగనన్న లేఅవుట్ పనులు కార్యరూపం దాల్చడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తక్షణ పరిష్కారానికి చొరవ తీసుకున్న మంత్రి అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు.



సంపతిపురంలో జగనన్న లేఅవుట్ పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాఠశాలకు కుర్చీలు, బెంచీల వితరణ

రాంబిల్లి: గోవిందపాలెం పాఠశాలకు 18 కుర్చీలు, 3 బెంచీలను దాతలు వితరణగా అందజేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ధూళి అప్పలరాజు, వైస్ చైర్మన్ జోగా సరోజిని, బుజ్జిబాబు దంపతులు బెంచీలు, కుర్చీలు అందజేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



కుర్చీలు , బెంచీలు అందజేస్తున్న దాతలు

గ్రామాల్లో సమస్యలపై పోరాడాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలపై పోరాడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు తెలిపారు. సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము అధ్యక్షతన నిర్వహించిన అచ్యుతాపురం మండల సీపీఎం సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ పలు సమస్యలను ప్రస్తావించారు. ఆయా సమస్యల పరిష్కారానికి అన్ని గ్రామాల్లో పర్యటిస్తామని పేర్కొన్నారు. అచ్యుతాపురం-అనకాపల్లి మార్గాన్ని విస్తరించాలని, పూడిమడక జెట్టీని నిర్మించాలని కోరారు. కర్రి అప్పారావు, ఎస్.రామునాయుడు, బి.రామ్‌కుమార్, సోమునాయుడు పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండల సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లిటౌన్: భారత మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక రింగ్‌రోడ్డు వద్ద అబ్దుల్ కలాం సేవాసంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాజ్‌పేయి పాలనలో దేశ ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు, మడగ అప్పారావు, పిట్ట సూర్యారావు పాల్గొన్నారు.



సచివాలయాలే 'ఆధార్'ం

- అందుబాటులోఆధార్ సవరణ, అప్‌డేట్ సేవలు
- నూతన జిల్లా పేరు మార్చుకునేందుకు అవకాశం
- ఏడు రకాల గుర్తింపు కార్డులతో సవరణలు

ఆధార్ అప్‌డేట్, కొత్త ఆధార్ నమోదు ఓ ప్రహసనం. ఓ రోజు ముందు బ్యాంక్/పోస్టాఫీసుకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. మరుసటి రోజు లైన్లో ఉండాలి. కొన్నిసార్లు సర్వర్ పనిచేయకపోతే మళ్లీ వెళ్లాలి. వీటన్నింటికీ చెక్ పెడుతూ ప్రభుత్వం సచివాలయాల్లోనే ఆధార్ సేవల్ని అందుబాటులోకి తెచ్చింది. అనకాపల్లి పట్టణ, మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో ఇపుడీ సేవలు లభిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుమ్మపాల: పోస్టాఫీసు, బ్యాంకుల్లో మాత్రమే అందించే ఆధార్ సేవలు ఇప్పుడు సచివాలయలకు చేరాయి. ఆధార్ కార్డుల్లో సవరణలు, కొత్త కార్డుల నమోదుకు గ్రామీణ ప్రజలు పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలికేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధార్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహిస్తోంది.



సచివాలయ ఆధార్ శిబిరం ద్వారా సేవలు పొందుతున్న ప్రజలు

అన్ని సచివాలయాల్లోనూ అవకాశం

నాలుగు దశల్లో అన్ని సచివాలయాల్లో ఆధార్ సేవలు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది చివరలో ప్రారంభించి ఒక్కో సచివాలయంలో ఒక్కో రోజు చొప్పున దశల వారీగా సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించారు. ప్రజలకు ఆధార్ అప్‌డేట్, తప్పుల సవరణ, కొత్త కార్డుల నమోదు వంటి అనేక సేవలను అందిస్తున్నారు. అనకాపల్లి పట్టణం(జీవీఎంసీ) పరిధిలో 26, మండల పరిధిలో 29 సచివాలయాలు ఉన్నాయి. కొన్ని సామూహిక ప్రాంతాల్లో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజల చెంతకు వెళ్లి మరీ ఆధార్ సేవలు అందిస్తున్నారు. అన్ని సచివాలయాల్లో ప్రస్తుతం ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

జిల్లా పేరు మార్పునకు అవకాశం

జిల్లాల విభజన అనంతరం అడ్రస్ మార్పులు చేసుకోవాల్సిన వారి సంఖ్య లక్షల్లో ఉంది. నూతన జిల్లా అనకాపల్లి పేరును ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో విశాఖ జిల్లాగా ఉండటంతో దాన్ని తొలగించి నూతన జిల్లా అనకాపల్లి పేరును చేర్చేందుకు పోస్టాఫీసులు, బ్యాంకుల్లో క్యూలు కట్టాల్సిన పని లేదు. నేరుగా గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి ఉచితంగానే ఈ మార్పులు చేసుకోవచ్చు.

ఏడు గుర్తింపు కార్డులతో సవరణలు

ఆధార్‌లో తప్పుల సవరణకు ప్రాథమికంగా ఏడు రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలి. 2010 నుంచి 2016 వరకు ఆధార్ మార్పులు చేసుకోని వారు ఇప్పుడు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. వివిధ తప్పుల సవరణలు, కొత్త కార్డుల నమోదునూ ఇక్కడి నుంచే చేసుకోవచ్చు. వీరు గుర్తింపు పత్రాలుగా పాన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పదవ తరగతి మార్క్సు కాపీ, యూఐడీఏఐ గుర్తింపు కలిగిన పత్రంలో గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ, గ్యాస్ బుక్, గ్రూప్-ఏ అధికారి ధ్రువీకరించిన పత్రం, ఆస్తి పన్ను పుస్తకం జెరాక్స్‌లను సమర్పించి ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు.